వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

- అరచేతిలో వైకుంఠం చూపడం టీడీపీ నైజం
- అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నాం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ ఇక్బాల్, ఎమ్మెల్యే శంకరనారాయణ


హిందూపురం: టీడీపీ కౌన్సిలర్ కుటుంబానికి చేకూరిన పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


పెనుకొండరూరల్: మక్కాజిపల్లి తండాలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

హిందూపురం: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించి.. పారదర్శక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం లక్ష్మీపురంలోని 9వ వార్డులో ఇన్‌చార్జి నాగరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ.. బుక్‌లెట్లను అందజేశారు. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. టీడీపీ నాయకులకు కూడా పథకాలు అందించడం జరిగిందన్నారు. ఇందుకు ఈ వార్డులోని గంగమ్మ నిదర్శమన్నారు. ఈమె ఇదే 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అత్త అని తెలిపారు. అలాగే టీడీపీ కార్యకర్త మంజు 20 ఏళ్లుగా టీడీపీ కోసం పని చేసినా ఎలాంటి లబ్ధి చేకూరలేదన్నారు. అయితే జగన్ పాలనలో తమకు పథకాలు అందాయంటూ టీడీపీ సానుభూతిపరులు చెప్పడం సంతోషంగా ఉందన్నారు.

జగన్‌ను ఆశీర్వదించాలి

ప్రజలే పాలకులు తాము వారికి సేవకులమని నిత్యం ప్రజా సంక్షేమం తపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో, పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేశారన్నారు. బాలకృష్ణ ఎన్నికల సమయంలో సినిమా డైలాగులు చెప్పి, అరచేతిలో వైకుంఠం చూపుతారన్నారు. అలాంటి నటులకు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. వారి బాటలోనే ఇక్కడి టీడీపీ నాయకులు కూడా ప్రచారం కోసం ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి పత్తాలేకుండా పోతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి చేసేది మేమే.. ప్రజల మధ్య నిలిచేది మేమే అన్నారు. మాట తప్పని మడమ తిప్పని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో పునరంకితం అవుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్ చైర్మన్ జబివుల్లా, సర్పంచ్ ఆనంద్, కౌన్సిలర్లు ముస్తాక్, ఆయూబ్, మల్లికార్జున, రోషన్, నాగేంద్రమ్మ, కో–ఆప్షన్ సభ్యులు రహమత్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, లతీఫ్, ఖలీల్, కట్లబాష, మల్లికాబాను, చందూ, బసిరెడ్డి, రాము, శివశంకర్ రెడ్డి, నౌషాద్, నజీర్‌దాదు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెనుకొండ రూరల్: సమస్యల పరిష్కారానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకరాయణ తెలిపారు. మండలంలోని వెంకటగిరిపాళ్యం పంచాయతీ పరిధిలోని మక్కాజిపల్లి తండాలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, పక్కా గృహాలు మంజూరు చేయించాలని పలువురు కోరారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదని ఏఈ పరమేశ్వర రెడ్డికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సమస్యలను తెలుసుకుని ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, ఎంపీడీఓ శివశంకప్ప, సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, మండల కన్వీనర్ నాగలూరు బాబు, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ నాయక్, ఆదినారాయణ, పురుషోత్తంరెడ్డి, అశ్వర్థరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రానాయక్, అశోక్ నాయక్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, పోగాకు రామచంద్ర, శ్రీకాంత్ రెడ్డి, వైశాలి జయశంకర రెడ్డి, కొండల రాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభ ప్రతిష్టకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సప్పలమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టకు శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నిర్వహించే ధ్వజస్తంభ ప్రతిష్టలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ధ్వజారోహణం అనంతరం 41 రోజుల తరువాత అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, వైస్ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, చంద్రారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆనందరెడ్డి, సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మల్లికార్జున, అశ్వర్థనారాయణ, డీలర్ మూర్తి, వడ్డే హనుమయ్య, జయరెడ్డి, ఎస్సీ సెల్ మండల నాయకులు శంకర, శివశంకర్ పాల్గొన్నారు.

పరామర్శ

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన హరిజన నాగలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ శనివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు


గుంతలను మట్టితో చదును చేయించిన దృశ్యం

రొద్దం: మండలంలోని సుబ్బరాయప్ప కొట్టాల పావగడ–పెనుకొండ ప్రధార రహదారి నుంచి ఆర్ కుర్లపల్లి, బూచెర్ల, నాగిరెడ్డిపల్లి, కనుమర, నారనాగేపల, రాచూరుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. శనివారం దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేయించారు. జేసీబీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేయించి రోడ్డుకు మట్టిని తోలించి బాగు చేయించారు.

ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపాల్‌గా మైలారప్ప

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా మైలారప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సుజాత ఉరవకొండకు బదిలీపై వెళ్లారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం సి.బెలగల మండలం ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మైలారప్ప రొళ్ల ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌కు బదిలీపై వచ్చారు.

ఎడ్ల బండిని ఢీకొన్న కారు

- రెండు ఎద్దులకు తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో గాయపడిన ఎద్దు

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్ పేటె గ్రామం సమీపంలోని రైల్వే బ్రిడ్జ్ వద్ద శనివారం ఉదయం ఇసుకతో వెళ్తున్న ఓ ఎద్దుల బండిని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు.. గ్యాదికుంటె రామాంజినప్ప తన ఎడ్ల బండిలో ఇసుక వేసుకుని టీఎన్ పేటె గ్రామం వైపు బయలుదేరాడు. రైల్వే బ్రిడ్జ్ వద్దకు చేరుకోగానే పెనుకొండ నుంచి వస్తున్న ఓ కారు వెనుక నుంచి ఎడ్ల బండిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎడ్ల బండి బోల్తా పడింది. రెండు ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. రామాంజినప్పకు ఎటువంటి గాయాలు కాలేదు. అనంతరం గాయపడిన ఎద్దులకు స్థానిక పశు వైద్యశాలలో చికిత్స చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. తమతో కలసి చదువుకున్న రషీదా తల్లికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. పాఠశాలకు మైక్ వితరణ చేశారు.

జూదరుల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని బండ్లపల్లి గ్రామ శివారులో శనివారం జూదం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. రూ.5,075 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



'వైఎస్సార్ బీమా'పై అవగాహన

సోమందేపల్లి: గ్రామ సచివాలయ వలంటీర్లు గడువులోపు వైఎస్సార్ బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు రావు తెలిపారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో 'వైఎస్సార్ బీమా'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారికి బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జీలాన్ ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామికి పూజలు


అలంకరణలో రంగనాథ స్వామి

అమరాపురం: మండలంలోని కౌద్రేవు గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం రంగనాథ స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి అభిషేకం చేశారు. భక్తులు తెలిచ్చిన ఆకులు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళహారతి ఇచ్చారు. అమరాపురం గ్రామానికి చెందిన చిత్రశేఖర్‌యాదవ్, రంగప్ప తదితరులు భక్తులకు అన్నదానం చేశారు.

ఎమ్మెల్సీ ఇక్బాల్ ఔదార్యం


గిరిజమ్మకు ఇంటి పట్టా, ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: పట్టణంలోని 32వ వార్డు అహమ్మద్ నగర్‌లో ఆక్రమణల తొలగింపులో ఇల్లు కోల్పోయిన పేద కుటుంబానికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అండగా నిలిచారు. శనివారం ఇంటి పట్టాతో పాటు రూ.80 వేలు ఆర్థిక సహాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాలు.. ఇటీవల 32వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. రోడ్డు పక్కనే చిన్న ఇంటిని నిర్మించుకున్న గిరిజమ్మ ఇంటిని అధికారులు రోడ్డుకు అడ్డుగా ఉందని తొలగించారు. నిరాశ్రయులైన గిరిజమ్మ కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్లారు. తమను ఆదుకోవాలని వేడుకున్నారు. పేద కుటుంబాన్ని చూసి చలించిపోయిన ఎమ్మెల్యే ఇక్బాల్ వెంటనే అధికారులతో మాట్లాడారు. ఇంటి పట్టా, హౌసింగ్ పథకంలో భాగంగా ఇల్లు మంజూరు చేయించారు. అనంతరం తనవంతుగా గిరిజమ్మ కుటుంబానికి రూ.80 వేల ఆర్థికసాయం అందజేశారు. తమకు సాయం చేసిన ఎమ్మెల్సీకి గిరిజమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ రేష్మాబాను, బాబు, మాజీ ముత్తవల్లి కలీం, నాయకులు వెంకటేశ్వరరావు, చందూ, లతీఫ్‌సేట్, నౌషాద్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- కర్ణాటక మంత్రి మునియప్పను కోరిన ఎమ్మెల్యే తిప్పేస్వామి


తిరుమలలో మంత్రి మునియప్పకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న సరిహద్దు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కర్ణాటక పౌరసరఫరా శాఖ మంత్రి మునియప్పను ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. శనివారం కర్ణాటక మంత్రి మునియప్పను తిరుమలలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. అగళి, అమరాపురం, రొళ్ల, గుడిబండ, మడకశిర సరిహద్దులోని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో సరిహద్దు ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్ర సరిహద్దు వరకూ రోడ్లు బాగున్నాయని తెలిపారు. అదే విధంగా మడకశిర నియోజకవర్గంలోని విద్యార్థులు కర్ణాటకలో చదువుకుంటున్నారని తెలిపారు. సదరు విద్యార్థులందరినీ కర్ణాటక ప్రభుత్వం గడినాడు కన్నడిగులుగా గుర్తించేలా కృషి చేయాలని కోరారు. గడినాడు కన్నడిగులుగా గుర్తిస్తే కర్ణాటక ప్రభుత్వం అందించే కొన్ని రాయితీలు విద్యార్థులకు అందుతాయని తెలిపారు. పేద విద్యార్థులకు మంచి జరుగుతుందన్నారు. గతంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని కర్ణాటక ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. స్పందించిన కర్ణాటక మంతి మునియప్ప.. సమస్యలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు రామిరెడ్డి, చిక్కన్న, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిలోక్, సత్యనారాయణ, రత్నగిరిదొర, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించి, క్రమశిక్షణతో పెంచాలని బలిజ సంఘం నాయకులు సూచించారు. శనివారం స్థానిక రోటరీక్లబ్‌లో బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్, డిగ్రీ తదితర పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన బలిజ విద్యార్థులకు ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ సహకారంతో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన అద్విక్, నిత్యతో పాటు 40 మంది విద్యార్థులను అభినందించారు. పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. పిల్లలు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు వెంకటరాముడు, రాయల్ గోపాల్, ప్రభాకర్, ఉమేష్, పాపయ్య, శివరామ్, శ్రీనివాస్, అశ్వర్థ, రమేష్, ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చీరల పంపిణీ


మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని రెడ్డి సంఘం కార్యాలయంలో శనివారం రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు, ప్రభాస్ అభిమాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి, కేతగాని చెరువు, చాలకూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు రావు శనివారం తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భవతులు, బాలింతల వివరాలను నమోదు చేసిన రిజిష్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం, కోడిగుడ్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

రోడ్డు సర్‌ఫేజ్ లైన్ల ఏర్పాటు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఎన్‌హెచ్‌ఏఐ సహకారంతో శనివారం రోడ్డు సర్‌ఫేజ్ లైన్లను ఎస్‌ఐ శ్రీనివాసులు వేయించారు. ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు.

ముగిసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులు

హిందూపురం: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత కరాటే, జుడో శిక్షణ తరగతులు ముగిసినట్లు సీనియర్ మాస్టర్ రఫీక్ అహ్మద్ తెలిపారు. 40 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి పంపించిన సర్టిఫికెట్లను శనివారం స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో పంపిణీ చేశారు. అలాగే కరాటే శిక్షణ యూనిఫాం కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే, జుడో చిన్నతనం నుంచే అభ్యసించాలన్నారు. ఆల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు మరింత సమాచారం కోసం 996663366, 7093416678 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

హిందూపురం: పట్టణంలోని పలుచోట్ల మట్కా నిర్వహిస్తున్న ఆరుగురు బీటర్లను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదు, మట్కాచీటీలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. ఆబాద్‌పేటకు చెందిన అమీర్‌బాషా, హస్నాబాద్ చికెన్ రియాజ్, గాంధీనగర్ బాబాజాన్, అహమ్మద్‌నగర్ షేక్ నజరుల్లా ,షానూర్‌బాష మారుతి నగర్ నాగరాజును అరెస్టు చేశారు. దాడుల్లో సీఐ ఈరన్న, ఎస్‌ఐ హరుణ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి భజన మందిరాల ప్రారంభం

లేపాక్షి: మండలంలోని మద్దిపి, నాగానపల్లి గ్రామాల్లో శనివారం శ్రీసత్యసాయి భజన మందిరాలను శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రశాంతి పతాకావిష్కరణ, బాలవికాస్ మోడల్ క్లాస్ ప్రదర్శన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి బాబా చిత్రపటాలను పల్లకీలో ఊరేగించారు. సత్యసాయి సేవాసంస్థ భక్తులు శంకరనారాయణ, వేదంప్రసాద్, సీఆర్ రావు, ప్రసాద్, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి శనివారం సాయి భక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే నెల 3న గురు పౌర్ణమి వేడుకలు ఆలయంలో పెద్ద ఎత్తున జరుగుతాయి. నియోజకవర్గ వ్యాప్తంగా భిక్షాటన చేసి వస్తువులు, ధనం, ధాన్యం తదితర వాటిని ప్రజల నుంచి సేకరిస్తారు. భిక్షాటనలో పాల్గొనే భక్తులు ఉదయం 8 గంటలకే ఆలయం వద్దకు చేరుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

650 మందికి కంటి పరీక్షలు

హిందూపురం: స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాలలో ట్రినిటీ సర్వీసెస్, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 650 మంది కంటి పరీక్షలు చేయించుకునేందుకు హాజరయ్యారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ స్వప్న 195 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గత నెలలో ఆపరేషన్ చేయించుకున్న 215 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, క్యాంప్ మేనేజర్ నాగరాజు, శివప్రకాష్, ముతవల్లి నూరుల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోటార్ వితరణ

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని రాజేశ్వరి కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రాజరాజేశ్వరి ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం స్వామి శనివారం మోటార్ అందజేశారు. మోటార్ విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు ఆనందమ్మ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరుతున్న హిందూపురం 26వ వార్డు ముస్లిం యువకులు

హిందూపురం: స్థానిక ప్రశాంత్ నగర్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద పట్టణంలోని 26వ వార్డుకు చెందిన మసూద్, అన్వర్, దాదుతో పాటు 25 మంది మైనార్టీ యువకులు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ వారికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. అలాగే మండలంలోని బీరేపల్లి పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ గొల్లరంగప్ప, మరికొందరు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, నాయకులు ఆర్‌కె ఖలీల్, చాంద్‌బాషా, ఫకృద్దీన్, వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఏకశప్ప, రాజారెడ్డి, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విత్తన రాగులకు రిజిస్ట్రేషన్లు

రొళ్ల: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి విత్తన రాగులకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించనున్నట్లు ఏఓ ప్రసన్నకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాగి పంట విస్తీర్ణాన్ని పెంచడం కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

వేసవి సెలవులు పొడిగించాలి

హిందూపురం టౌన్: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, వేసవి సెలవులను మరో 10 రోజులు పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 12 నుంచి పాఠశాలలను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఎండలు, వడగాల్పులు మాత్రం ఇప్పటికీ తగ్గలేదన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, వేణుగోపాల్, దేవరాజ్, కార్తీక్, పవన్, సాయి కిరణ్, వినీత్, బాలాజీ, హరీష్, మూర్తి పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఓ ఆటో విషయంలో శనివారం మధ్యాహ్నం గొడువపడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. పెనుకొండకు చెందిన మారుతి, షబీర్, రొద్దంకు చెందిన మారుతి, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయ సందర్శనకు శనివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఆలయంలోని వివిధ శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించారు. అనంతరం అన్నదాన సత్రంలో పర్యాటకులు, భక్తులకు భోజన వసతి కల్పించారు.

ఫెర్రర్ ఆశయాలు కొనసాగిద్దాం


మాట్లాడుతున్న ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున

అమరాపురం: అర్హులకు ప్రభుత్వం, ఆర్డీటీ ద్వారా అందించే పథకాలు సక్రమంగా అందేలా చూడాలని సీడీసీ సభ్యులకు ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో సీడీసీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలన్నారు. వృద్ధాప్య పింఛన్, అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా కానుక, డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే ఆర్డీటీ అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. గ్రామాల్లో యువతీ యువకులతో సమావేశం ఏర్పాటు చేసి నాయకత్వ లక్షణాలు కలిగిన వారిని గుర్తించి వారి ద్వారా పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి యువకులు కృషి చేయాలన్నారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయమైన స్పందించు సహాయమందించు కార్యక్రమాన్ని కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ సావిత్రి, ట్రైనర్లు రామంజనేయులు, నరసింహులు, అధికారులు, సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

మడకశిర (అగళి): గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి చొరవ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి కోరారు. శనివారం అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, నర్సులు తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలన్నారు. ఆశావర్కర్లు గ్రామాల్లోని పరిస్థితులను వైద్య సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి జాప్యం కాకుండా ప్రజలకు వైద్య సేవలందేలా చూడాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇమ్యునైజేషన్ ప్రక్రియ క్రమం తప్పకుండా జరగాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలందించాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్లు శివానంద్, గాయత్రి, సిబ్బంది లక్ష్మీదేవి, శాంతమ్మ, ఏఎస్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులపై ఫ్రీ పాసుల పిడుగు

పావగడ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (శక్తి యోజన) ఆదివారం ప్రారంభం కానుంది. మహిళలకు ఈ పథకం వరంగా మారగా.. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలకు శాపంగా మారింది. ఫ్రీ బస్సు పాసులతో స్థానిక ప్రైవేట్ బస్సులపై పిడుగుపడినట్టు అయిందని బస్సుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కేఎస్‌ఆర్టీసీ బస్సులతో పోటీ పడలేక ప్రైవేట్ బస్సులు కొట్టుమిట్టాడుతున్నాయి. పావగడలో మొత్తం ప్రైవేట్ బస్సులు 90 ఉండగా.. ప్రైవేట్ బస్సుల ముందు వెనకాల ఆర్టీసీ బస్సులు నడుస్తుండటంతో కలెక్షన్లు లేక కనీసం డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.